క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ రక్షణ



మొక్క నాటుతున్న ఎస్సై ఆదిలక్ష్మి

అద్దంకి: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ చేసినట్లేనని ఎస్సై అదిలక్ష్మి అన్నారు. ఆమె ఆదివారం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు విడుదల చేసే ఆక్సిజన్‌తో పర్యావరణంలోని విషవాయులు శుద్ధి అవుతాయన్నారు. రాబోయో కాలంలో గ్లోబల్ వార్మింగ్ రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు.

నేడు కొండాయపాలెంలో గడప గడపకు

బల్లికురవ: బల్లికురవ పంచాయతీ పరిధిలోని కొండాయపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు జగనన్న స్వచ్ఛ సంకల్పంపై సమావేశం

చీరాల టౌన్: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో చేయాల్సిన కార్యక్రమాలపై సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయితీల కార్యదర్శులు, సచివాలయ అడ్మిన్లు గ్రామ పంచాయతీల పూర్తి సమాచారంతో సమీక్షకు హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

జాగ్రత్తలతో డెంగీ నివారణ సాధ్యం

బల్లికురవ: వర్షాల సీజన్ కారణంగా పగటి పూట కుట్టే దోమల ద్వారా డెంగీ జ్వరాలు సోకే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతతో పాటు వాడని నీటి తొట్లు, రోళ్లు, పూల కుండీలు, పాత టైర్లు, వాడని కూలర్లు నీరు లేకుండా చూసి బోర్లించి ఉంచుకోవాలని చెప్పారు. జ్వరం, దగ్గు జలుబు ఉంటే తక్షణమే వైద్యశాలకు రావాలని కోరారు. కుష్టువ్యాధిపై గత నెల 26వతేదీ ఈనెల 16వ తేదీ వరకు గ్రామాల వారిగా సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వే బృందానికి సహకరించి ఏవైనా వంటిపై మచ్చలు ఉంటే వాటిని పరిక్షించుకోవాలని చెప్పారు.

నేడు స్వర్ణ, కుంకలమర్రులో జగనన్న సురక్ష

కారంచేడు: మండలంలోని స్వర్ణ-2, కుంకలమర్రు-2 గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీ విజయలక్ష్మి, తహశీల్దారు ఎస్ వెంకటరత్నంలు ఆదివారం సంయుక్త ప్రకటలో తెలిపారు. స్వర్ణ, కుంకలమర్రు గ్రామాల్లోని రెండు గ్రామ సచివాలయాల వద్ద రెండు టీంల పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగిస్తామన్నారు.

స్పందనకు అధికారుల హాజరు తప్పనిసరి

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సర్క్యులర్ జారీ చేశారని తహశీల్దార్ తెలిపారు. అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

నేడు కేవీ పాలెంలో జగనన్న సురక్ష

బల్లికురవ: మండంలోని కొమ్మినేనివారిపాలెం, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహసీల్దార్ కే రవిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు టీములు పర్యవేక్షణలో క్యాంపు కొనసాగిస్తామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పూర్తయిన ఇల్లు



నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ

కల కానిది.. నిజమైనది

జగనన్న లే ఔట్ల వివరాలు..

లే ఔట్లు	మంజూరైన ఇళ్లు	నిర్మాణం లో ఉన్నవి
పంగులూరు-1	54	34
పంగులూరు-2	48	07
పంగులూరు-3	85	60
రేణింగవరం	56	48
కొండమంజులూరు	60	46
భగవాన్‌రాజుపాలెం	73	43
బైటమంజులూరు	40	33
ముప్పవరం-1	52	48
ముప్పవరం-2	54	43
ముప్పవరం-3	52	43
జాగర్లమూడివారిపాలెం	39	10
కొండమూరు	63	47
మొత్తం	676	462



పంగులూరులో జగనన్న కాలనీ

- పేదల సొంతింటి కల సాకారం
- లే అవుట్లలో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు
- విద్యుత్ లైన్లు, రహదారులు, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు
- 60 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి

జే.పంగులూరు: ఇళ్లు ప్రతి ఒక్కరి కల. కూడు, గుడ్డ, నీడ ప్రతిమనిషికి అవసరమయ్యే మౌలిక వసతి. ఎన్నడూ లేని విధంగా ప్రతి పేదవాడికి జగనన్న ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. పేదవాడి కలలు సాకారం దిశగా అడుగులేస్తోంది. ఫలితాలు సాధిస్తూ పేదవాడి మన్ననలు అందుకుంటుంది మన జగనన్న ప్రభుత్వం. పేదల సొంతింటి కల సాకరం చేస్తూ కాలనీలు కాదు గ్రామాలనే తలపిస్తున్నాయి జగనన్న లే ఔట్లు. ఇళ్ల పట్టా పొందిన లబ్ధిదారుడు తమ స్థలాల్లో చురుగ్గా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలు అర్హులందరికీ ఇళ్ల పథకాన్ని ఎన్నికల్లో హామీ ఇచ్చి పేదవాడికి సెంటున్నర భూమి ప్రైవేటు భూమిని కొనుగొలు చేసి వారికి అనువైన స్థలాన్ని అందించడమే కాకుండా, ఇళ్లు నిర్మించుకునేందుకు రూ. 1.8 లక్షలతో పాటు ఉపాధి హమీ పథకంలో రూ. 28 వేలు రకు నిధులు అందించారు. డ్వాక్రా సంఘాల నుంచి బ్యాంక్ లింకేజీ రుణాలు మరో రూ. 35 వేల రకు లబ్ధిదారుడికి అందేలా చూస్తున్నారు అధికారులు. జే.పంగులూరు మండలంలో 12 జగనన్న లే ఔట్లు కాగా వాటిలో వాటిలో 676 ఇళ్ల స్థలాలకు గాను 462 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 60 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, 40 శాతం ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. అంతేకాకుండా ఇసుక, సిమెంట్, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.

90 శాతం ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి..



మండలంలో 462 ఇళ్లు మంజూరు అయ్యాయి. 60 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, 40 శాతం ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణం చేపట్టిన ప్రతి ఒక్కరికీ బిల్లులు వెంటనే మంజురు అవుతున్నాయి. జగన్న కాలనీలతో పాటు 236 మంది సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇళ్ల బిల్లులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఇసుక, సిమెంట్, ఇనుము కూడా అందిస్తున్నాం.

టీ కిషోర్ కుమార్, హౌసింగ్ ఏఈ

జగనన్నకు మా జీవితాంతం రుణపడి ఉంటాం..



ఈమే పేరు బొల్లా సుప్రియ, పంగులూరు గ్రామం. పెళ్లయిన నాటి నుంచి సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బదులు పడ్డారు. ఎన్నికల ముందు జగనన్న ఇంచి హమీ నేను ఇంతవరకు మరిచి పోలేదని, ఇచ్చినట్టే నాకు ఇళ్ల స్థలం, స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు డబ్బులు ఇచ్చాడు. మా జీవితంలో ఇంత మేలు చేసిన జగనన్నకు మా కుటుంబం ఎప్పుడు రుణపడి ఉంటామని తెలిపింది.

అధికారులే దగ్గర ఉండి ఇంటి నిర్మాణాలు చేయిస్తున్నారు..



ఇతని పేరు ఖాశీ బుడే, పంగులూరు గ్రామం. ఇతనిది చిన్న కుటుంబం కూలీనాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇళ్లు లేకపోవడంతో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ వివరాలు నమోదు చేసుకున్నాడు. రాసుకున్నదే తడవుగా నాకు ఇంటిస్థలంతో పాటు, ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు కూడా ఇస్తున్నారు. ఇళ్ల నిర్మాణం బట్టి బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశాడు.

గృహ ప్రవేశం చేసి ఏడాది అవుతోంది..



ఈమే పేరు షేక్ నదియా బీ, పంగులూరు గ్రామం. ఇంటి నిర్మాణం పూర్తిచేసి గృహ ప్రవేశం చేసి కూడా ఏడాది అవుతోంది. జగనన్న ఇచ్చిన ఇంట్లో ఆనందంగా, గౌరవంగా బతుకుతున్నామని తెలిపింది. కాలనీలో వీధిదీపాలు, కుళాయిలు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. మాకు ఇంత మేలు చేసిన జగనన్న రుణం ఎన్నటికి తీర్చుకోలేమని ఆనందం వ్యక్తం చేసింది.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు బోనాలు



బోనాలు, కలశాలతో ఊరేగిస్తున్న మహిళలు, భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 1008 జల బిందెలతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణలు జరిపించారు. విశేష పూజలతో పాటు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పోతిన అక్కయ్యచౌదరి ఇంటి నుంచి మేళ తాళాలతో, బోనాలు, కలశాలతో మహిళలు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా పోలేరమ్మ కొలుపులు

కారంచేడు: ప్రతి ఏటా సాగుకు ముందు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కొలుపులు నిర్వహించడం ఈ గ్రామ ఆనవాయతీ. దీనిలో భాగంగా ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందుగా గ్రామంలోని రామాలయం బజారుకు చెందిన కొలుపులను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి తలంటు స్నానాలు ఆచరించి, పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. యువతీ, యువకులు వీరతాళ్లతో అమ్మవారి ప్రతిమకు ముందు నృత్యాలు చేశారు. గ్రామంలోని భక్తులు, రైతులు, పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు కొలుపుల్లో పాల్గొన్నారు.



కొలుపుల్లో అమ్మవారి చిత్రపటం

పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ నిర్లక్ష్యం



మూసి ఉంచిన ల్యాబ్ టెక్నీషియన్ గది

ఇంకొల్లు (చినగంజాం): ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగంలో నిర్లక్ష్యం కారణంగా రోగులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గడచిన రెండు నెలలుగా విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని రోగులు వాపోతున్నారు. ప్రతి రోజు ఆసుపత్రికి రావడం ల్యాబ్ టెక్నీషియన్ కోసం ఎదురు చూడటం తిరిగి వెళ్లడం రోగులకు పరిపాటి అయింది. ప్రస్తుత పరిస్థితిలో షుగర్ రోగులు ఎక్కువ కావడం, వారికి ప్రతి నిత్యం పరీక్షలు అవసరమవడంతో ఆసుపత్రికి పదుల సంఖ్యలో రోగులు వచ్చి పోతున్నారు. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ గది తలుపులు మూసి ఉండటంతో నిరాశగా వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. ఈవిషయమై వైద్యాధికారి డాక్టర్ ఎమీమాను వివరణ కోరగా ల్యాబ్ టెక్నీషియన్ శివ కార్తీక్ గైర్హాజరు విషయమై ప్రజలిచ్చిన ఆరోపణలు వాస్తవమేనని, ఆసుపత్రిలో ఆయన తరచుగా గైర్హాజరు అవుతున్నారని చెప్పారు. ఈవిషయమై డీఎం అండ్‌హెచ్‌ఓ ఆసుపత్రికి వచ్చినప్పుడు ఫిర్యాదు చేశామన్నారు. మరళా ఆమెకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సంతమాగులూరు (అద్దంకి): గ్రంథాలయం విజ్ఞాన బాండాగారమని లైబ్రేరియన్ భాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గ్రంథాలయంలో చదవడం నాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అత్యధికంగా విద్యార్థులు పాల్గొని వివిధ రకాల పుస్తకాలు చదివారు. ఇదే విధంగా ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవి జ్ఞానం సంపాదించుకోవాలని గ్రంథపాలకుడు విద్యార్థులతో చెప్పారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తాన్ని అందిస్తున్న దాత

అద్దంకి: రక్తదానం ప్రాణదానంతో సమానమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీ కృష్ణ అన్నారు. పట్టణానికి చెందిన కందిమళ్ల పవిత్ర ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో స్పందించిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు రోటరీ బ్లడ్ డొనేషన్ చైర్మన్ చుండూరి మురళీ సుధాకర రావు ద్వారా పోలిశెట్టి రాజేశ్ అనే యువకుడి చేత అవసరమైన ఏ పాజిటివ్ రక్తాన్ని ఇప్పించారు. రక్తదాతను పవిత్ర బంధువులు అభినందించారు. కార్యక్రమంలో సెక్రటరీ చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని, ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దేవాంగపురి గ్రామ పంచాయతీ సెక్రటరీ, ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీబాపూజీ సూచించారు. ఆదివారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గుమ్మస్తాలకాలనీ, కృపానగర్, హస్తినాపురం, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

- చూసీ చూడనట్లుగా ఎస్ఈబీ అధికారులు
- స్థానిక పోలీసులు సైతం స్పందించని వైనం



రహదారి పక్కనే ఉన్న పంజాబీ దాబా



దాబాలో మద్యం తాగుతున్న మందుబాబులు

మేదరమెట్ల: జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ దాబాలో యథేచ్ఛగా అక్రమ మద్యం విక్రయాలు, సేవించడం అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా సాగుతున్నా ఎస్ఈబీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎవరికి అందాల్సిన వాటాలు వారికి అందిచడమే పట్టించుకోకపోవడానికి నిదర్శం అని స్థానికులు గుసగుసలాడుతున్నారు. కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓల్డ్ పంజాబీ దాబాలో మద్యం విక్రయాలతో పాటు బార్‌అండ్ రెస్టారెంట్‌గా నడుపుతున్నారు. మద్యం సేవించే వారికోసం ప్రత్యేకంగా పాకలను ఏర్పాటు చేసి అవి నిండితే ఆరు బయట టేబుల్స్ వేసి మరీ సిటింగ్ ఏర్పాటు చేయడం విచ్చలవిడిగా సాగుతున్నా ఎస్ఈబీ అధికారులు మాత్రం అటువైపు చూడటం లేదు. మద్యం తాగించడం చట్టపరంగా నేరమని దీనికి పర్మిషన్ ఉందా అని అడిగితే స్థానిక పోలీసులు నాకు పర్మిషన్ ఇచ్చారు అని దాబా కౌంటర్‌లో ఉన్న వ్యక్తి తెలిపాడు. దాబాలో మద్యం తాగడం జరుగుతుందని ఎస్సైకి ఫోన్ చేయగా పర్మిషన్ గురించి తెలియదన్నారు. ఆవెంటనే ఎస్సై ఇద్దరు హోంగార్డ్‌లను పంపి మద్యం సేవిస్తున్న వారిని, దాబా నిర్వాహకుడిని మేదరమెట్ల పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్ఈబీ అధికారులకు ఫోన్ చేసినా స్పందించ లేదు.

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ ఉమేశ్, ఎస్సై ఆదిలక్ష్మి

- గుర్రాల కాలనీలో కార్డన్ సర్చ్
- 16 ద్విచక్రవాహనాలు, ఒక కారు, ఆటో స్వాధీనం

అద్దంకి: పట్టణంలో ఇటీవల గంజాయి పెద్ద మొత్తంలో పట్టుబడడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి పట్టణంలోని గుర్రాల కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వివరాలను ఆదివారం సీఐ ఉమేశ్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. జిల్లా నుంచి వచ్చిన 80 మంది పోలీసులు మహిళా కానిస్టేబుళ్ల సాయంతో కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు. పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. గంజాయి, నాటుసారా తయారీని అరికట్టడమే లక్ష్యంగా సెర్చ్‌ను నిర్వహించామని చెప్పారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు తెలిసినా, తరలిస్తున్నట్లు తెలిసినా పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈసెర్చ్‌లో ఎస్సై ఆదిలక్ష్మి, జే పంగులూరు ఎస్సై తిరుపతిరావు, కొరిశపాడు ఎస్సై చౌదరిలు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌ల స్టాపింగ్‌పై హర్షం



స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

చినగంజాం: స్థానిక రైల్వే స్టేషన్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వడంపై మండల రైల్వే ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు అక్కల రామకృష్ణారెడ్డి ప్రహర్షం వ్యక్తం చేశారు. కరోనా ప్రారంభం అయినప్పటి నుంచి చినగంజాం రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను రద్దు చేయగా వాటిని ఇప్పటి వరకు పునరుద్ధరించే చర్యలు చేయలేదు. అయితే వాటిలో తిరుపతి నుంచి కాకినాడ వెళ్లే 17249 ఎక్స్‌ప్రెస్, బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళ్లే 17481 ఎక్స్‌ప్రెస్, పూరి నుంచి తిరుపతి వెళ్లే 17479 ఎక్స్‌ప్రెస్‌ను చినగంజాం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం నుంచి స్టాపింగ్ ఇవ్వడం హర్షించదగిన విషయమన్నారు. స్టేషన్ మాస్టర్ రాజేష్‌ను ఆయన స్వయంగా కలిసి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

నియోజకవర్గ ఓబీసీ సంక్షేమ అధ్యక్షుడిగా రామకృష్ణ



మార్టూరు: పర్చూరు నియోజకవర్గ ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మార్టూరుకు చెందిన పల్లపు రామకృష్ణను నియమించినట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు, రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ తెలిపారు. స్థానిక ఆర్కే టవర్స్ నందు శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు బాధ్యతలు అప్పగించిన ఓబీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పలు కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

పర్చూరు (చినగంజాం): రౌడీషీటర్లు, పాతనేరస్తులు సత్ప్రవర్తనతో ఉండాలని, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎన్ చెంచుప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్‌లు, పాత నేరస్తులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. తరచుగా ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా బహిష్కరణ వంటి కఠిన చర్యలు కూడా ఉంటామని తెలిపారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ తొలగిస్తామని ఎస్సై పేర్కొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో 20 వేల ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు నిర్మిస్తున్న యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నేడు కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో సోమవారం ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరితగతిన పథకానికి నిధులు కేటాయించి పథకాన్ని పూర్తి చేసి నీరు అందించాలని వారు కోరారు. ఈపథకం పూర్తయితే వేల ఎకరాలు బీడు భూముల నుంచి మాగాణిలోకి మారుతాయన్నారు.